RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, ఏప్రిల్ 20, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 16 | పేజీలు: 8 | వెల : రూ.1



### పాక్ చర్చలకు బ్రేక్.. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్



### "రైతు భరోసా రెండో విడత నేడు విడుదల"

- రాష్ట్రవ్యాప్తంగా రూ.5,563 కోట్లు విడుదలకు సిద్ధం
- రైతుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి బటన్ నొక్కనున్నారు
- ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చెల్లింపులు కొనసాగింపు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తి
- రైతు సంక్షేమానికి భారీ ఖర్చు చేస్తున్న రాష్ట్రం: తుమ్మల



### అబద్ధాలతో రేవంత్ అధికారంలోకి ::: బండి సంజయ్

- మహిళల హామీలపై సీఎం మాట తప్పారని ఆరోపణలు
- మహిళా బిల్లును అడ్డుకోవడంలో కీలక పాత్ర అన్న వ్యాఖ్యలు
- దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారంటూ విమర్శలు
- కేసీఆర్ తరహాలోనే పాలన సాగుతోందని ఆరోపణ
- బీజేపీ బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయన్న కేంద్ర మంత్రి



### హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
- 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు
- మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు

# ఎమ్మెల్సీల ఫైల్‌పై ఉత్కంఠ.. గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

### కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఆమోదించాలని విజ్ఞప్తి

### మంత్రిగా అజారుద్దీన్‌కు సమీపిస్తున్న ఆరు నెలల గడువు

### నేడు సుప్రీంకోర్టులో విచారణ జరగనుండటంతో పెరిగిన ఉత్కంఠ



హైదరాబాద్ : తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం వ్యవహారం మరోసారి వేడెక్కింది. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదం డరాం, మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను వెం టనే ఆమోదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలిసి ఆయన లోక్‌భవన్‌లో గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమ య్యారు. ఈ నియామకంపై ప్రభుత్వం ఇంత పట్టుదలగా ఉండటానికి ప్రధాన కారణం అజారుద్దీన్ మంత్రి పదవి. గత ఏడాది అక్టోబర్ 31న మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన,

(మిగతా 2వ పేజీలో)

**మహమ్మద్ అజారుద్దీన్ మంత్రి పదవికి గడువు ఏప్రిల్ 30తో ముగియనుండటంతో ఈ అంశం అత్యంత కీలకంగా మారింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆయన ఆ తేదీకి ముందు చట్టసభ సభ్యుడిగా మారాలి.ఈ ఫైల్ ప్రస్తుతం న్యాయపరమైన కారణాలతో గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఇదే విషయంపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుండటంతో ఉత్కంఠ మరింత పెరిగింది.**



### గోదావరి జలాలపై రేవంత్ ఏపీతో కుమ్మక్కయ్యారు: హరీశ్

- ఢిల్లీ పర్యటనలపై 'టిఫిన్ రాజకీయం' అంటూ ఎద్దేవా
- రుణమాఫీపై తుమ్మలకు ఓపెన్ ఛాలెంజ్
- రైతు సమస్యలపై ప్రభుత్వంపై విమర్శలు
- బీఆర్ఎస్ సమ్మేళనంలో ఘాటైన వ్యాఖ్యలు

ఖమ్మం/గుర్రంపోడు: రాష్ట్రంలో ప్రాజెక్టుల అంశం రాజకీయంగా మళ్లీ చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఖమ్మం జిల్లాలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, గోదావరి నీటి వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. నల్లమల సాగర్ పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు నీటిని మళ్లించే

(మిగతా 2వ పేజీలో)



### హైదరాబాదులో వడగళ్ల వాన బీభత్సం

- హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన
- గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- హైదరాబాద్ నగరానికి రాత్రి 7 గంటల వరకు వర్ష సూచన
- మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

(మిగతా 2వ పేజీలో)



### హర్మూజ్ జలసంధిలో హైటెన్షన్.. అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్ల దాడి

- ఇరాన్ వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ప్రతీకారంగా అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్ల దాడి
- భగ్నమైన కాల్పుల విరమణ ఒప్పందం.. చర్చలకు ఇరాన్ నిరాకరణ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ వాణిజ్య నౌకను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడంతో, ప్రతీకారంగా ఆ దేశ యుద్ధ నౌకలపై

(మిగతా 2వ పేజీలో)

### మహిళల పేరుతో రాజకీయ పోరు

- బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసి ద్రోహం: కాంగ్రెస్, డీఎంకే
- బీజేపీదే మహిళా సాధికారతకు నిబద్ధత: అమిత్ షా
- డీఎంకేపై కుటుంబ రాజకీయాల ఆరోపణలు
- ఎన్డీఏతోనే శాంతి, అభివృద్ధి సాధ్యం
- తమిళనాడులో బీజేపీకి పెరుగుతున్న మద్దతు





### తమిళనాడులో ఘోర విషాదం... బాణసంచా పరిశ్రమలో పేలుడు, 18మంది మృతి

- తమిళనాడు విరుధునగర్‌లో భారీ పేలుడు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన
- దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

వాయిస్ ఆఫ్ ప్రజలు
సోమవారం, ఏప్రిల్ 20, 2026

# మహిళల పేరుతో రాజకీయ పోరు

**బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసి ద్రోహం: కాంగ్రెస్, డీఎంకే**

**బీజేపీదే మహిళా సాధికారతకు నిబద్ధత: అమిత్ షా**

**డీఎంకేపై కుటుంబ రాజకీయాల ఆరోపణలు**

**ఎన్డీఏతోనే శాంతి, అభివృద్ధి సాధ్యం**

**తమిళనాడులో బీజేపీకి పెరుగుతున్న మద్దతు**



చెన్నై: మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్ నేపథ్యంలో రాజకీయ విమర్శలు తీవ్రరూపం దాల్చాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాలపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ, కాంగ్రెస్, డీఎంకే పార్టీలు మహిళలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే కీలక అవకాశాన్ని అవి అడ్డుకున్నాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమే మహిళా సాధికారత కోసం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదకురిచి నియోజకవర్గంలో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే ప్రభుత్వంపై కుటుంబ రాజకీయాల ఆరోపణలు గుప్పిస్తూ, సీఎం స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని ముందుకు తీసుకురావడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఇలాంటి రాజకీయాలు ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలపడుతోందని, ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తేనే శాంతిభద్రతలు మెరుగవుతాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న ప్రజా మద్దతు మార్పు సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు.

# తమిళనాడులో ఘోర విషాదం...

# బాణసంచా పరిశ్రమలో పేలుడు, 18మంది మృతి



**తమిళనాడు విరుధునగర్‌లో భారీ పేలుడు**

**మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన**

**దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్**

**సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం**

తమిళనాడులో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విరుధునగర్ జిల్లా, కట్టనార్‌పట్టిలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 18 మంది కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది. ప్రమాద తీవ్రతకు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, విస్ఫోటనానికి దారితీసిన కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ దుర్ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కట్టనార్‌పట్టి బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటనంలో పలువురు మరణించారన్న వార్త తీవ్ర వేదనకు గురిచేసింది" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు కేకేఎస్‌ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను సీఎం స్టాలిన్ ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## పాక్ చర్చలకు బ్రేక్..
## అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్



కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగియడానికి కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్న వేళ అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. అమెరికా తమ కార్గో నౌకను స్వాధీనం చేసుకోవడంతో, పాకిస్థాన్‌లో జరగాల్సిన శాంతి చర్చల్లో పాల్గొనబోమని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ చర్యకు ప్రతీకారం తీర్చుకుంటామని తీవ్రంగా హెచ్చరించడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్‌కు చెందిన 'టౌస్కా' అనే కార్గో నౌకను అమెరికా నౌకాదళం ఆదివారం అడ్డగించి, స్వాధీనం చేసుకుంది. హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో యూఎస్‌ఎస్ స్ప్రూయెన్స్ యుద్ధనౌక దాని ఇంజిన్ రూమ్‌పై కాల్పులు జరిపి నిలిపివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ చర్య "సాయుధ సముద్రపు దొంగతనం" అని అభివర్ణించిన ఇరాన్, దీనికి తగిన బదులు చెబుతామని హెచ్చరించింది. అమెరికా తమపై నౌకా దిగ్బంధనం కొనసాగిస్తూ, అసాధ్యమైన డిమాండ్లు పెడుతున్నందునే చర్చలకు దూరంగా ఉంటున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. మరోవైపు, ఇరాన్ కాల్పుల విరమణను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ ప్లాంట్, వంతెనను కూల్చివేస్తామని ఆయన సోషల్ మీడియా వేదికగా బెదిరించారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 22తో ముగియనుంది. ఈ ఒప్పందాన్ని పొడిగించే లక్ష్యంతో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో చర్చలు జరగాల్సి ఉండగా, తాజా పరిణామాలతో అవి నిలిచిపోయాయి.

# రైతు భరోసా రెండో విడత నేడు విడుదల

**రాష్ట్రవ్యాప్తంగా 5,563 కోట్లు విడుదలకు సిద్ధం**

**రైతుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి బటన్ నొక్కనున్నారు**

**ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చెల్లింపులు కొనసాగింపు**

**రైతు సంక్షేమానికి భారీ ఖర్చు చేస్తున్న రాష్ట్రం: తుమ్మల**

కాళేశ్వరం: రాష్ట్ర రైతులకు మరో కీలక ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రైతు భరోసా పథకం రెండో విడత కింద సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రూ.5,563 కోట్లను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమక్షంలో నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామంలో జరుగనుంది. సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా అధికారులు కలిసి పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. దేశంలోనే అత్యధికంగా రూ.1.10 లక్షల కోట్లను రైతుల కోసం ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఎకరాకు సంవత్సరానికి రెండు విడతల్లో రూ.12 వేల చొప్పున రైతు భరోసా నిధులు అందిస్తున్నామని వివరించారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన మంత్రి, అప్పటి పాలనలో భారీగా నిధులు దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, గతంలో నిర్మించిన కొన్ని ప్రాజెక్టులు నాణ్యతలేమితో వినియోగానికి నోచుకోలేదని అన్నారు. వాటిపై కేంద్ర సంస్థలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52మంది అరెస్ట్

**అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు**

**9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు**

**మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ**

**ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు**



హైదరాబాద్: దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీల ఫైల్‌పై ఉత్కంఠ..
## గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ



రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఏప్రిల్ 30 లోపు చట్టసభ సభ్యుడు కావాల్సి ఉంది. గడువుకు కేవలం 10 రోజులే సమయం ఉండటంతో ఈ అంశం అత్యంత కీలకంగా మారింది. మంత్రివర్గం ఆమోదించి పంపిన ఈ ఫైల్ కొన్ని న్యాయపరమైన కారణాలతో గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలోనే శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జనరల్ కూడా గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. అయితే, సోమవారం (ఏప్రిల్ 22) ఇదే అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. దీంతో కోర్టు తీర్పు వచ్చేవరకు గవర్నర్ వేచి చూస్తారా, లేక ముందే నిర్ణయం తీసుకుంటారా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ గడువులోగా ఆమోదం లభించకపోతే, అజారుద్దీన్‌తో రాజీనామా చేయించి తిరిగి ప్రమాణ స్వీకారం చేయించే ప్రత్యామ్నాయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు, విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాల గురించి కూడా చర్చ జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సీఎం గవర్నర్‌కు పరిచయం చేశారు.

## గోదావరి జలాలపై
## రేవంత్ ఏపీతో కుమ్మక్కయ్యారు: హరీశ్

ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలపై కూడా హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి కాకుండా ఇతర రాజకీయ ప్రయోజనాల కోసం పర్యటనలు జరుగుతున్నాయని అన్నారు. ఒక కేంద్ర మంత్రి ఇంట్లో టిఫిన్ చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను హరీశ్‌రావు ఖండించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రుణమాఫీ పూర్తయిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. సిద్దిపేటకు రావాలని, లేక తాను రఘునాథపాలెంకు వస్తానని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా తానేదార్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావు రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర రాజకీయాలపై కూడా హరీశ్‌రావు స్పందించారు. ప్రజలు ఆశించిన విధంగా పాలన సాగడం లేదని, ప్రభుత్వం పనితీరు పట్ల అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

## హైదరాబాదులో వడగళ్ల వాన బీభత్సం

కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో రాత్రి 7 గంటల వరకు భారీ వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, వికారాబాద్ సహా మరికొన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## హర్మూజ్ జలసంధిలో హైటెన్షన్..
## అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ డ్రోన్ల దాడి

డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఒమన్ తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య నెలకొన్న కాల్పుల విరమణ ఒప్పందం ముక్కలైంది. చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న 'తూస్కా' అనే వాణిజ్య నౌకను అమెరికాకు చెందిన 'యూఎస్‌ఎస్ స్ప్రూయెన్స్' యుద్ధ నౌక అడ్డుకుంది. అమెరికా విధించిన నౌకాదళ నిర్బంధాన్ని ఉల్లంఘించిందన్న ఆరోపణలతో, హెచ్చరికల అనంతరం నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. అమెరికా చర్యను 'సాయుధ సముద్రపు దొంగతనం'గా ఇరాన్ సైనిక కమాండ్ అభివర్ణించింది. నౌకను స్వాధీనం చేసుకున్న కొన్ని గంటల్లోనే తమ బలగాలు డ్రోన్లతో ప్రతిదాడికి దిగినట్లు తెలిపింది. తమ ఐఆర్‌జీసీ బలగాల జోక్యంతో అమెరికా సేనలు వెనక్కి తగ్గాయని ఇరాన్ మీడియా చెబుతుండగా, నౌక ఇంకా తమ వద్దే ఉందని అమెరికా స్పష్టం చేస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు హర్మూజ్ జలసంధి నుంచే సాగుతుంది. ఈ తాజా పరిణామాలతో చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మంగళవారంతో కాల్పుల విరమణ గడువు ముగియనుండగా, ఇకపై చర్చలు జరిపేది లేదని ఇరాన్ తేల్చిచెప్పింది.

## అబద్ధాలతో రేవంత్
## అధికారంలోకి ::: బండి సంజయ్

హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. అబద్ధాల పునాదులపైనే ఆయన అధికారంలోకి వచ్చారని ఆరోపిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. మహిళలందరికీ ప్రతినెలా రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని, తులం బంగారం, స్కూటీ వంటి హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా బండి సంజయ్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రానికి సమాన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల పెంపు ప్రతిపాదనలు తీసుకొచ్చిందని, అయితే విపక్షాలు వాటిని అడ్డుకున్నాయని అన్నారు. మహిళా బిల్లును అడ్డుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పాలనపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. గతంలో కేసీఆర్ పాలనలో జరిగినట్లే ప్రస్తుతం కూడా అబద్ధాలు, మోసాలతోనే ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. నిజాయితీగా పనిచేసే నాయకులపై బురద చల్లడం సీఎం అలవాటుగా మారిందని విమర్శించారు. మొత్తంగా, మహిళా హామీలు, పార్లమెంట్ బిల్లులు, రాష్ట్ర పాలన వంటి అంశాలపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.





# మున్నూరుకాపు భవనంలో సుదర్శన నరసింహ కళ్యాణం

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం నిర్వహించారు 108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం జరిగింది ఆనంతరం ఒక వెయ్యి ఎనిమిది మంది దంపతులతో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు లోక కళ్యాణదుర్గం విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు మున్నూరు కాపు సామాజిక బంధువులతో పాటు అనేక మంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బంధువులతో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వి.హన్మంతరావు, తీన్మార్ మల్లన్న, చైర్మన్ వాణి భరత్, ప్రముఖులు వీఐపీలు విచ్చేసారు ఈ కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేశారు మున్నూరు కాపు సామాజిక వర్గ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఈ కార్యక్రమాన్నీ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ శ్రీనివాస్ విక్రమ్ అనిల్, రవి, తదితరులు పాల్గొన్నారు.




## సీజన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మల్టీడిసిప్లినరీ మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన

హైదరాబాద్ : ఏప్రిల్ 19;( వాయిస్ టూ డే) బాగ్ అంబర్‌పేట్‌లో సీజన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మల్టీడిసిప్లినరీ మెడికల్ క్యాంప్ కు విశేష స్పందన లభించింది.సీజన్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ హరి చరణ్, డైరెక్టర్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత ఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మధుసూదన్ రెడ్డి హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన సీజన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని వారు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి చరణ్ మాట్లాడుతూ.. వైద్య పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలను ముందుగానే కనుగొని తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.ఈ ఉచిత క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి నివారణ చర్యలను వైద్యులు వివరించారు. వైద్యుల సలహా మేరకు ఉచిత మందుల పంపిణీ చేశారు.



## హేమాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయంకు రూ: 3 లక్షల విరాళం

నాగారం, ఏప్రిల్19:-(వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర కీసర మండలం రాంపల్లి దయారలో వెలసిన హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి వెంకులోనిగుట్ట దేవస్థానం. ఆలయ పునర్నిర్మాణ మహా యజ్ఞానికి. కీసర గ్రామ మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ రూ: 3,00,166/- రూపాయలు విరాళంగా ఆదివారం ఆలయ ప్రతినిధులకు అందజేసారు. రాంపల్లి దాయరలో వెలిసిన హేమాద్రి వెంకటేశ్వర స్వామి వెంకులోనిగుట్ట ఆలయ పునర్నిర్మాణం లో భాగంగా ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు.

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ & కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ గా బొంగునూరి కిషోర్ రెడ్డి నియామకం



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19(వాయిస్ టుడే): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు తెలంగాణ రాష్ట్ర ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకులిరాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ గా హెచ్ వేణుగోపాల్ రావు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ గా . నియమించినందుకు ముందుగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలతో మమేకమై ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలియజేశారు.



## జగద్గిరిగుట్టలో శేఖర్ యాదవ్ బస్తీబాట

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19(వాయిస్ టుడే): జగద్గిరి నగర్‌లో బస్తీ అధ్యక్షులు జగన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ పర్యటనలో స్థానిక బస్తీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.మంజీరా వాటర్ సరఫరా సరిగా లేకపోవడం వల్ల నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బోర్ బావులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన శేఖర్ యాదవ్ , ఈ విషయాన్ని స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, రేణుక, బాలమణి, రాజేష్ ప్రసాద్, సుధాకర్, రాజు, నేత రెడ్డప్ప, రమేష్, సత్యనారాయణ, సోము, యాదయ్య గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చడం అత్యుత్తమ సేవ

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19(వాయిస్ టుడే): చింతల్ బస్ స్టాండ్ వద్ద బిఆర్ఎస్ నాయకులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజల దాహార్తిని తీర్చడం అత్యుత్తమ సేవ అని, ప్రజలకు సేవ చేయాలని ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరికీ ఈ కార్యక్రమం మరింత స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, వనం శ్రీనివాస్, ఎండి. నజీరుద్దీన్, రమణా రెడ్డి, ఆంజనేయులు, నగేష్, జయం చారి, డీజే రమేష్, వివిధ డివిజన్లకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దుండిగల్ సర్కిల్‌లో సెన్సస్ 2027 శిక్షణ ప్రారంభం

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19(వాయిస్ టుడే): దుండిగల్ సర్కిల్ మీటింగ్ హాల్ నందు, సెన్సస్ 2027, పైన ఎన్యూమీ నే టర్స్, సూపర్వైజర్స్ దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎన్ వెంకటేశ్వర్ నాయక్ రెండవ రోజు శిక్షణా తరగతులను ప్రారంభించినారు, అనంతరం మొదటి విడత మే 11 వ తారీకు నుండి, జూన్ 9వ తారీకు వరకు చేపట్టడం జరుగుతుంది, ఈ మొదటి విడత జనాభా లెక్కల కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని నుండి 34 ప్రశ్నల సమాధానాలు తీసుకుంటారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, గవర్నమెంట్ స్కూల్ టీచర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## హెల్త్ హబ్‌గా హైదరాబాద్

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఏప్రిల్ 19: హైదరాబాద్ ను హెల్త్ హబ్ తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. బర్కత్ పుర లోని డాక్టర్ ఆనంద్ ఇంటర్నేషనల్ హేయిర్ ట్రాన్స్ ప్లాంట్, స్కిన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొని ఆధునాతనమైన స్కిన్, హేయిర్ లేజర్ మిషన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వనున్న డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, మరో ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డిని ఎంపిక చేయడం జరిగిందని, మంచి ఫలితాలు వస్తున్నాయని దానిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి పూర్తి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలో తెలంగాణను వైద్య రంగంలో ఆదర్శంగా తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వైద్యానికి అత్యంత అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి. ఆనంద్ కుమార్, డాక్టర్ సమత, దీపక్, శిల్ప, హరికుమార్, లాస్య, ఉమా, సమిత, ఆర్.కె.జైన్, శేషునారాయణ, టి.ఆనంద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా..

### బండారి లక్ష్మారెడ్డి

### ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్, ఎలక్ట్రానిక్ ) డైరీ ఆవిష్కరణ

ఉప్పల్, ఏప్రిల్ 19: జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చునని సూచించారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా) నూతన సంవత్సర -2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) అధ్యక్షులు వద్దేపల్లి కిషోర్, క్లబ్ ప్రధాన సలహాదారులు కంచుకట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. ఉప్పల్ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన ప్లాట్ల విషయాన్ని కూడా అసెంబ్లీలో లేవనెత్తానున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేలా కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, తెలంగాణా హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ ఛైర్పర్సన్ డా: శ్రీవాణి చౌదరి, లీగల్ అడ్వైజర్ హైకోర్టు న్యాయవాది కోంద్రోన్ పల్లి గిరిబాబు,వివిధ పార్టీల నాయకులు తాడూరి శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకారపు అరుణ్ పటేల్, నెర్థం భాస్కర్‌గౌడ్, కోల రవికుమార్‌గౌడ్, ఎండి. రఫిక్, కంది శ్రవణ్ కుమార్, జలీల్‌పాషా, గుడి మధుసూదన్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, పిట్టల నరేష్, తెలంగాణ సంపత్, నాగరాజు, చల్ల వీరారెడ్డి, మార్నేని ఫణీంద్ర, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు,సకినాల ప్రసాద్, మేకల దయాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, సంయుక్త కార్యదర్శి వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు ఆనంద నరసింహారెడ్డి, పంబిళ్ల కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్లు కీర్తి సంతోష్ రాజ్, పయ్యావుల సంతోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రతిభా రికార్డుల గ్రంథంలో డా. పెరుక రాజుకు స్థానం

హైదరాబాద్, ఏప్రిల్ 19;( వాయిస్ టూ డే) : ప్రముఖ జాతీయ కవి, రచయిత, బహుభాషావేత్త డా. పెరుక రాజు అసాధారణ సాహిత్య ప్రతిభకు గుర్తింపుగా, ఆయన పేరు ప్రతిభా రికార్డుల గ్రంథం"నమోదు అయింది. సామాజిక చైతన్యంతో కూడిన శక్తివంతమైన రచనల ద్వారా ఆయన చూపుతున్న విశిష్ట ప్రతిభకు సాధారణంగా వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనపరచిన ముఖ్యుల్లో కొందరికి మాత్రమే స్థానం దక్కుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డా. రాజు స్మారక చిహ్నం (మెమెంటో), శాలువా, పతకం (మెడల్) మరియు రికార్డు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడుడా. రంజిత్, సుప్రీం కోర్టు జడ్జ్ బురుగుల మధుసూదనరావు చిత్ర దర్శక-నిర్మాత జి. విజయ్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజ శేఖర్, నిర్మాత విక్కు నాయక్, నటి నమ్రత, విద్యావేత్త ఆంజనేయులు తదితర సాహితీ, విద్యా రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 20 ఏప్రిల్ 2026



## నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాం

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 19(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా పలు కార్యక్రమాలలో పాల్గొనాలని వారిని ఆహ్వానించారు.

## బంజారా భాష వ్యాకరణంపై పరిశోధన చేసిన తొలి బంజారా బిడ్డగా రికార్డు సృష్టించిన మేఘావత్ ప్రమీల



సికింద్రాబాద్ (వాయిస్ టుడే):బంజారా భాష వ్యాకరణంపై పరిశోధన చేసిన తొలి బంజారా బిడ్డగా మేగవత్ ప్రమీల రికార్డు సృష్టించింది. "బంజారా భాషకు తెలుగులో వర్ణనత్మక వ్యాకరణం" అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖలో ఆచార్య పి. వారిజారాణి మేడం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఇందుకు గాను శనివారం ఓయూ పరీక్షల విభాగం ప్రమీలకు డాక్టరేట్ ప్రకటించింది. ఇప్పటి వరకు బంజారా సంస్కృతి సాహిత్యలపై పరిశోధనలు అనేకం వచ్చాయి. కానీ బంజారా భాషా వ్యాకరణంపై వచ్చిన తొలి పీహెచ్డీ ఇదే కావడంతో రికార్డులో నిలిచిపోనుంది. ప్రమీల నల్లగొండ జిల్లా, తిరుమలగిరి మండలం, నేతపురం ధన్సింగ్ తండాలో నిరుపేద బంజారా కుటుంబంలో మేగవత్ సోని పుల్య దంపతులకు జన్మించారు. సాధారణంగా గిరిజనులు ఆడపిల్లలకు చదువు అవసరంలేదు అనే భావనలో నాగరికతకు అమడ దూరంలో ఉంటారు. అటువంటిది కుటుంబంలో ఐదవ సంతానం అయిన ప్రమీల తెలుగులో నెట్ జెఆర్ఎఫ్ సాధించి ఓయూలో డాక్టరేట్ పట్టా పొందడం అంటే గొప్ప విశేషమనే చెప్పాలి. ఇందుకు ప్రమీల మామ డాక్టర్ నగార మోతిలాల్, అన్న మేగావత్ భాస్కర్ ల సహకారం ఎంతో ఉందని వారన్నారు. తను పుట్టిన గ్రామంలోనే ఒక వైపు కూలి పనులు చేసుకుంటూ పదవ తరగతి పూర్తి చేశారు. ఇంటర్ దామరచర్ల ట్రైబల్ వెల్ఫేర్ లో ఉత్తమ మార్కులు సాధించి కళాశాల టాపర్ గా నిలిచారు. కోఠి ఉమెన్స్ కాలేజ్ ప్రస్తుత వీరానారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ లో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో పీజీ పూర్తి చేశారు. 2017లో యూజీసీ నెట్‌లో జెఆర్ఎఫ్ సాధించిన తొలి బంజారా మహిళగా చరిత్రలో నిలువుగా నేడు డాక్టరేట్ సాధించారు. ఇందుకు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.



## యాదాద్రి కొండపైన ప్రాణ అపాయ స్థితి నుండి కాపాడిన సిబ్బంది

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : యాదాద్రి కొండపైన ఒక భక్తుడు అనారోగ్యం తో గుట్ట పైకి వచ్చి దర్శనానికి వెళ్ళే ఓపిక లేక పార్కింగ్ కార్ లో కూర్చొని సేద తీరుతూ నిద్ర పోయాడు ఎండ వేడి కి తట్టుకోలేక స్పృహ కోల్పోయాడు అతని బంధువులు దర్శనం కి రెండు గంటల వరకు రాలేదు అది గమనించిన దేవస్థాన సెక్యూరిటీ మాధవి, సహోద్యోగి కి సమాచారం అందించి మనీష్, మహేష్. కానిస్టేబుల్ లక్ష్మణ్ సహాయం తో కొండపైన ఉన్న మెడికేర్ హాస్పిటాల్ లో ట్రీట్మెంట్ చేయించి వాళ్ల కుటుంబానికి అప్పజెప్పడం జరిగింది. అందుకు దేవస్థానం సిబ్బంది అభినందిచారు.

## నాచారం ట్రస్ట్ కార్స్ కారు మేళా"కు అనూహ్య స్పందన

### అతి తక్కువలో 50వేలకు కారు: రోషన్






నాచారం (వాయిస్ టుడే):నాచారం లో కారు మేళా"కు అనూహ్య స్పందన లభిస్తుంది. కార్ల ప్రదర్శన మేళాకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది కస్టమర్లు హాజరయ్యారని ట్రస్ట్ కార్స్ నిర్వాహకులు రోషన్ తెలిపారు. ప్రతి ఆదివారం, గురువారం కార్ మేళా నిర్వహిస్తున్నారు. చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయి వరకు తమ వద్ద సెకండ్ హ్యాండ్ కార్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అతి తక్కువలో 50వేలకు కారు అందిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఒక కారు అనే నినాదం తమ ఉద్దేశం అన్నారు. ప్రతి ఆదివారం, గురువారం నిర్వహించే కారు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమను సంప్రదించాలనుకునే వారు 9666127703 నెంబర్ కు కాల్ చేయాలని ట్రస్ట్ కార్స్ నిర్వాహకులు రోషన్ తెలిపారు.



## మోతి నగర్‌లో ప్రజా సమస్యలపై పాదయాత్ర

### -- త్వరిత పరిష్కారానికి బండి రమేష్ హామీ

కూకట్‌పల్లి; ఏప్రిల్ 19(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మోతి నగర్ పరిధిలోని అవంతి నగర్ తోటలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ నివాసితులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను రమేష్ కు వివరించారు. ముఖ్యంగా నాలాకు మెష్ లేకపోవడం వల్ల చెత్తను నేరుగా నాలాలో వేస్తున్నారని, దాంతో నాలా పూడిపోవడంతో మురుగునీటి ప్రవాహం ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా ఇరువైపులా మెష్ ఏర్పాటు చేసి, ప్రతినెల పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కాలనీకి ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్ పక్కన నిర్మించిన రక్షణ గోడ సగం వరకే ఉండటంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఆ గోడను కాలనీ అంతమేరా పూర్తిగా నిర్మించాలని నివాసితులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోతి నగర్ మాజీ కార్పొరేటర్ సయ్యద్ బాబు, కాలనీ అధ్యక్షులు కే గోపాల్ చౌదరి, జనరల్ సెక్రటరీ కే కృష్ణ, ట్రెజరర్ ఎం రమేష్, అలాగే సత్య రెడ్డి, మురళి, సుమంత్, సంతోష్, సుధాకర్, సురేందర్ గౌడ్, ఉమేష్, రియాజ్, శ్రీహరి, మహేష్, కే శశి, అనిల్ తదితర కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే స్పందించడం ద్వారా ప్రజలతో నిత్యం అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా బండి రమేష్ నిలుస్తున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు.



## సమయస్ఫూర్తితో స్పందించిన కూకట్‌పల్లి పోలీసులు

### - యువతి ప్రాణాలు కాపాడిన ధైర్యవంతుల చర్య

కూకట్ పల్లి; ఏప్రిల్ 19(వాయిస్ టుడే): కూకట్‌పల్లి ప్రాంతంలో చోటుచేసుకున్న ఓ హృదయ విదారక ఘటనలో పోలీసులు అప్రమత్తంగా స్పందించి ఓ యువతి ప్రాణాలను రక్షించారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. రియా (20), తండ్రి యాదగిరి, డిప్లొమా విద్యార్థిని. ప్రస్తుతం కేపీహెచ్‌బీ కాలనీలోని షణ్ముఖ్ హాస్టల్‌లో నివసిస్తున్న ఆమె స్వస్థలం తెలంగాణలోని కల్వకుర్తి. వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురైన ఆమె, ఆత్మహత్యకు యత్నిస్తూ ఐడీఎల్ సరస్సు వద్దకు వెళ్లింది. డయల్-100కు సమాచారం -- పోలీసుల తక్షణ స్పందన ఈ రోజు ఉదయం సుమారు 11:55 గంటలకు డయల్-100కు సమాచారం అందగానే, కూకట్‌పల్లి పోలీసులు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా ఘటనాస్థలానికి చేరుకున్నారు. ధైర్యసాహసాలతో ప్రాణరక్షణ ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఐ దీక్షిత, అలాగే పెట్రోల్ కార్ డ్రైవర్ హెచ్‌జీ-1130 వెంకటప్ప కలిసి సమయస్ఫూర్తితో స్పందించారు. అప్పటికే యువతి సరస్సు మధ్యలోకి వెళ్లిపోయినప్పటికీ, పోలీసులు ప్రాణాలను లెక్కచేయకుండా నీటిలోకి దిగి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. కౌన్సెలింగ్ ఉ భద్రత అనంతరం యువతికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించి, ఆమెను సురక్షిత ప్రదేశానికి తరలించారు. ప్రస్తుతం ఆమె తన సమస్యల గురించి వెల్లడించేందుకు ఇష్టపడటం లేదని పోలీసులు తెలిపారు. మానవతా దృక్పథానికి నిదర్శనం ఈ ఘటనతో సైబరాబాద్ పోలీసులు మరోసారి ప్రజల ప్రాణ రక్షణలో తమ నిబద్ధత, వేగవంతమైన స్పందన, మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా, ఆత్మహత్యలాంటి ఆలోచనలు చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహాయక సంస్థలను సంప్రదించడం ఎంతో ముఖ్యం. ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేస్తుంది.

## కూకట్‌పల్లిలో ఘనంగా బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు 50వ జన్మదిన వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్



కూకట్‌పల్లి: ఏప్రిల్ 19(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు 50వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, నాయకులు మరియు కార్యకర్తల సమూహంతో ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫతేనగర్ నగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు, యువ మోర్చా సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై, వడ్డేపల్లి రాజేశ్వరరావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు అందించడం, శాలువాలతో సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాజేశ్వరరావు పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడుతూ, ఆయన నాయకత్వం కూకట్‌పల్లి ప్రాంతంలో బీజేపీకి మరింత బలాన్ని తీసుకువస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకలు కేవలం జన్మదిన కార్యక్రమంగా కాకుండా, పార్టీ ఐక్యతను, కార్యకర్తల ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా విజయవంతంగా నిలిచాయి.



## ఘనంగా స్ఫూర్తి డెవలపర్స్ 'గణపురం గార్డెన్స్' బ్రోచర్ ఆవిష్కరణ

### ముఖ్య అతిథిగా విచ్చేసి బ్రోచర్‌ను విడుదల చేసిన డాక్టర్ ఎం.ఎన్.ఆర్.

సూర్యాపేట జిల్లా ఏప్రిల్ 19 (వాయిస్ టుడే) : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ స్ఫూర్తి డెవలపర్స్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గణపురం గార్డెన్స్" మెగా వెంచర్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం.ఎన్.ఆర్ ప్రాజెక్ట్ అధికారిక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఎన్.ఆర్ మాట్లాడుతూ.. సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో, అన్ని రకాల మౌలిక సదుపాయాలతో స్ఫూర్తి డెవలపర్స్ ఈ వెంచర్‌ను తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. పెట్టుబడిదారులకు నమ్మకమైన చిరునామాగా స్ఫూర్తి డెవలపర్స్ గణపురం గార్డెన్స్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాలమైన అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం. పర్యావరణ హితంగా, పార్కులు మరియు పచ్చదనంతో కూడిన వెంచర్. కలెక్టరేట్ కు కూతవేటు దూరంలో నేషనల్ హైవే కి ఆనుకుని రవాణా మార్గాలకు చేరువలో, భవిష్యత్తులో అత్యంత అభివృద్ధి చెందే ప్రాంతంలో ఈ వెంచర్ ఏర్పాటు చేయబడింది. అనంతరం స్ఫూర్తి డెవలపర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ..వినియోగదారుల నమ్మకమే పునాదిగా తాము ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సకల సౌకర్యాలతో ప్లాట్లను/ఫ్లాట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎన్.ఆర్ టీమ్ సభ్యులు సంస్థ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ ప్రముఖులు మరియు కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గండిమైసమ్మలో ఘనంగా హిందూ సమ్మేళనం

### ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సభ

### విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19(వాయిస్ టుడే): హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గండిమైసమ్మ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు ఆమండ్ల మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గండిమైసమ్మ బస్తీ వేదికగా హిందూ సమ్మేళనం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సభలో శివరుద్ర స్వామీజీ, వీహెచ్‌పీ నేత నరసింహమూర్తి, సేవికా సమితి వక్త రజిత పాల్గొని తమ సందేశాలను ప్రజలకు అందించారు. ఐదు ఉపబస్తీల నుంచి సుమారు 2,600 మందికి పైగా ప్రజలు, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోపూజ, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు నిర్వాహకులు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ హిందూ సమ్మేళనం ప్రాంతీయ ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా విజయవంతంగా ముగిసింది.



# యాదాద్రిలో ఎంపీ వద్దిరాజు దంపతుల ప్రత్యేక పూజలు



## -- కేసీఆర్ సేవలను ప్రశంస

యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ, సమీప బంధువులతో కలిసి ఆదివారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేసిన అభివృద్ధిని ఎంపీ రవిచంద్ర ప్రశంసించారు. యాదగిరిగుట్టను యాదాద్రి దివ్యక్షేత్రంగా తీర్చిదిద్ది, ఆలయాన్ని దేశంలోనే అద్భుతంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. కేసీఆర్ గొప్ప దైవభక్తుడని పేర్కొన్నారు.

ఎంపీ రవిచంద్ర తన కుటుంబ సభ్యులు, బాబాయి-పిన్ని ఆకుల రాజయ్య--స్వరూపరాణి, సన్నిహితులు మారికల్ పోత సుధీర్ కుమార్, సంగాని రజనీకాంత్, కొత్త లక్ష్మణ్ పటేల్, తూడి జనార్ధన్ తదితరులతో కలిసి స్వామివారిని దర్శించుకుని తమ తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ, యాదాద్రిలో కల్పించిన అత్యాధునిక సౌకర్యాలతో ప్రతిరోజూ వేలాది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. స్వామివారి కరుణాకటాక్షాలతో తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, అలాగే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి పదవి చేపట్టి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.





## యాదాద్రిలో విశ్వశాంతి మహాయజ్ఞం

### - పాల్గొన్న ఎంపీ వద్దిరాజు దంపతులు



యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన శ్రీసుదర్శన నరసింహ స్వామి విశ్వశాంతి మహాయజ్ఞం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు, మున్నూరుకాపు సంఘం తెలంగాణ గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి ఈ మహాయజ్ఞానికి హాజరయ్యారు. మున్నూరుకాపు (కాపు) భవన్ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో యాదాద్రిలోని మున్నూరుకాపు భవన్ ప్రాంగణంలో గణేష్ పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మహాయజ్ఞం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భవన్ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మహోత్సవానికి వద్దిరాజు రవిచంద్ర--విజయలక్ష్మీ, ఆకుల రాజయ్య--స్వరూపరాణి, మారికల్ పోత సుధీర్ కుమార్, బొంతు రాంమోహన్, ఆకుల రజిత్, రమేష్ హజారీ, సంగాని రజనీకాంత్, కొత్త లక్ష్మణ్ పటేల్, తూడి జనార్ధన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ప్రపంచ శాంతి, సమాజ శ్రేయస్సు కోసం నిర్వహించిన ఈ మహాయజ్ఞం విజయవంతంగా ముగిసింది.

## ఘనంగా బిషప్స్ అభిషేక ఆరాధన



తొర్రూరు, ఏప్రిల్ 19 వాయిస్ టుడే : కమ్యూనియన్ ఆఫ్ అంగ్లీకన్ చర్చెస్ ఇంటర్నేషనల్ సౌత్ ఏషియా తమిళనాడు రాష్ట్రం, చెన్నైవారి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన బిషప్ గుండెపాక వెంకన్న ఇశ్రాయేలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బిషప్ తాళ్లూరి రత్నప్రభు బిషప్స్ ఇన్స్టలేషన్ , అభిషేక ఆరాధన ఘనంగా జరిగింది. శు క్రవారం చెన్నై లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో "కమ్యూనియన్ ఆఫ్ అంగ్లీకన్ చర్చిస్ ఇంటర్నేషనల్" డయాసిస్ ద్వారా తెలంగాణ సిఏసిఐ స్టేట్ కోఆర్డినేటర్ బిషప్ బి ప్రభాకర్ నాయకత్వంలో సిఏసిఐ అడ్మిన్ బిషప్ జాన్ కమల్ హాస్ చెన్నై ఆధ్వర్యంలో "బిషప్ ఇన్స్టాలేషన్ అభిషేక ఆరాధన" దేవుని నామానికి మహిమకరముగా గొప్పగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్చి బిషప్ సంతాన పీటర్ "సిఏసిఐ సౌత్ ఏషియా" చెన్నై వారు పాల్గొని నూతనముగా సిఏ సిఐద్వారా బిషప్స్ ఇన్స్టాలేషన్ చేయబడుతున్న వారికి తగు సూచనలు, దైవ క్రమమును లేఖనముల ద్వారా తెలిపి, ఇన్స్టాలేషన్ సర్టిఫికెట్స్ యుఎస్ఏ వారైన ద మోస్ట్ రెవరెండ్ రండల్ పీకే "ఓఎస్ఏ " వారు ఇచ్చిన సర్టిఫికెట్స్ ను అందచేసారు.ఇక నుండి వీరు సిఏసిఐ సౌత్ ఏషియా లో బిషప్స్ గా కొనసాగుతారని ఆర్చి బిషప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్స్,రెవరెండ్స్, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హీరో షోరూంను ప్రారంభించిన స్థానిక శాసనసభ్యుడు కాలే యాదయ్య





చేవెళ్ల...ఏప్రిల్ 19(వాయిస్ టుడే) షాబాద్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హీరో షోరూం ను ఎమ్మెల్యే కలే యాదయ్య ప్రారంబించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభివృద్ధికి సంకేతమని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో అభివృద్ధి శూన్యం

### -- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర విమర్శలు

ఖమ్మం జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పూర్తిగా నిలిచిపోయాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజలకు ప్రయోజనం లేకుండా పాలన కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ఆదివారం సాయంత్రం ఖమ్మం మమతా మెడికల్ కాలేజీ మైదానంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ షష్ఠిపూర్తి సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తన్నీరు హరీష్ రావు, నామ నాగేశ్వరరావు, తాతా మధు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ మంత్రి అజయ్ కుమార్ హయాంలో ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తుచేసిన రవిచంద్ర, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ దూకుడును అడ్డుకున్నామని, భవిష్యత్తులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కొందరు ఎంపీలు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించిందని, అయితే రాష్ట్రానికి చెందిన ఇతర పార్టీల ఎంపీలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమని పేర్కొన్న ఎంపీ, పువ్వాడ అజయ్ కుమార్ దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.



## యాదాద్రిలో మహాయజ్ఞానికి ఎంపీ వద్దిరాజు దంపతుల హాజరు

యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన శ్రీసుదర్శన నరసింహ స్వామి విశ్వశాంతి మహాయజ్ఞం ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు, మున్నూరుకాపు సంఘం తెలంగాణ గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి ఈ మహాయజ్ఞానికి హాజరయ్యారు. మున్నూరుకాపు (కాపు) భవన్ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో యాదాద్రిలోని మున్నూరుకాపు భవన్ ప్రాంగణంలో గణేష్ పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మహాయజ్ఞం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి భవన్ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆకుల రాజయ్య--స్వరూపరాణి, మారికల్ పోత సుధీర్ కుమార్, బొంతు రాంమోహన్, ఆకుల రజిత్, రమేష్ హజారీ, సంగాని రజనీకాంత్, కొత్త లక్ష్మణ్ పటేల్, తూడి జనార్ధన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ప్రపంచ శాంతి, సమాజ శ్రేయస్సు కోరి నిర్వహించిన ఈ మహాయజ్ఞం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.



## బసవ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

ఝరాసంగం ఏప్రిల్ 19 (వాయిస్ టుడే) : జహీరాబాద్‌లో జరిగిన బసవ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాష్ట్రీయ బసవ దళ్ ఆహ్వానం మేరకు దత్తగిరి కాలనీలోని బసవ మంటప్లో సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరయ్యారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ--- సమాజంలో సమానత్వం, శాంతి, సౌహార్ధత కోసం బసవేశ్వరుడు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కేతకీ సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ నరసింహ గౌడ్, ప్రభు పటేల్, అప్పారావు పాటిల్తో పాటు రాష్ట్రీయ బసవ దళ్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 23న పోషకుల సమావేశం నిర్వహించాలి



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 19 : నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 23న బుధవారం పోషకుల సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న ఆదివారం తెలిపారు. విద్యార్థుల పురోగతి పరీక్షల ఫలితాలను తల్లిదండ్రులకు వివరించడంతో పాటు పాఠశాలలో అమలు చేస్తున్న రోడ్డు భద్రత స్వచ్ఛభారత్ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల గురించి తెలియజేయాలి. విద్యార్థులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పోషకులకు వివరించాలని సూచించారు. ఈ సమావేశం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిపి స్కూల్ ఎడ్యుకేషనల్ యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు.

## మేడేను ఘనంగా నిర్వహించాలి



తొర్రూరు, ఏప్రిల్ 20 వాయిస్ టుడే : ప్రపంచ కార్మిక వర్గం తమ హక్కుల కోసం రక్తం చిందించిన మేడే మేడే 1న దురాక్రమణ యుద్ధ బారాలకు వ్యతిరేకంగా ఘనంగా నిర్వహించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ)మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. ఆదివారం తొర్రూరులోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో టి యు సి ఐ ఏరియా కమిటీ సమావేశం జరిగింది. తొర్రూర్ ఏరియా కార్యదర్శి ఎండి షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కొత్తపల్లి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ తో కార్మిక వర్గం హక్కులు పూర్తిగా కోల్పోతుందని అన్నారు. 140 సంవత్సరాల క్రితం చికాగో మహానగరంలో కార్మికత్వం తమ రక్తాన్ని చిందించి సాధించిన ఎనిమిది గంటల పనిని నేడు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాల కోసం12 గశీటలకు పెంచడం జరిగిందన్నారు. ప్రమాదకరమైన పరిశ్రమంలో మహిళలు సైతం అర్ధరాత్రి పని చేయాలని నిబంధన అనాగరికమైనది అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు మేడే సందర్భంగా ప్రతినబునాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం చేస్తున్న దురాక్రమణ యుద్ధాలతో కార్మిక వర్గం ప్రజల పై పెను భారాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుగ వ్యతిరేక ప్రయత్నాలు చేయాల్సిన మోడీ ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం దేశ ప్రజలకు శాపంగా మారుతుందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీస వేతనాల గెజిట్ ముద్రించి అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందని అన్నారు ఫలితంగా 60 లక్షల మంది కార్మిక వర్గానికి పెద్ద ఎత్తున ఆర్థిక నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఈ సమావేశంలో టీయూసీఐ ఏరియా నాయకులు వడ్లకొండ లక్ష్మయ్య, బైరి శ్రీనివాస్ వెంకటరమణ, ధర్మయ్య అరవపల్లి వెంకన్న, పాడియా బీకు, గణేష్ ,జగన్ ,యాకయ్య ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## డీ-లిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల హక్కులపై బీజేపీ దాడి: మోహన్ గౌడ్



హనుమకొండ, ఏప్రిల్ 19: డీ-లిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లును అనుసంధానం చేసి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలనే బీజేపీ మైండ్ గేమ్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు నకరకంటి మోహన్ గౌడ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని విమర్శించారు. మహిళా బిల్లును ప్రత్యేకంగా అమలు చేయకుండా, డీ-లిమిటేషన్ అంశంతో కలిపి దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ విధానాలను కచ్చితంగా అమలు చేశాయని, అందువల్ల ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా తక్కువగా ఉందన్నారు. ఇప్పుడు అదే కారణంగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే కుట్రలో భాగంగానే డీ-లిమిటేషన్ అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రులతో చర్చించి డీ-లిమిటేషన్‌కు వ్యతిరేకంగా పోరాడి విజయాన్ని సాధించారని కొనియాడారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ గౌరవం ఉందని, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రత్యేకంగా ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ ముందుగానే డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. బీజేపీ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, తెలంగాణ ప్రజలు వారి కుట్రలను గమనించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచేలా మాట్లాడుతున్న బీజేపీ నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ గౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలనైనా కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలో తీవ్రంగా ఎండగడుతుందని మోహన్ గౌడ్ స్పష్టం చేశారు.





# శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

### దండు నాగేశ్వరరావు సమాజ సేవ.. పేదలకు నిత్యవసర వస్తువులు, దుస్తులు పంపిణీ

నాగార్జునసాగర్ ఏప్రిల్ 19 వాయిస్ టుడే: నాగార్జునసాగర్ లోని శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు దండు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అంధులు,వికలాంగులు, వృద్ధులకుతన తల్లిదండ్రులు దండు నరసయ్య , ఈశ్వరమ్మ జ్ఞాపకార్థము ఆదివారము అంధులులో వికలాంగులు వృద్ధుల కు నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, చీరలు, పాయింట్ షర్ట్స్, లుంగీలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన వృద్ధులు వికలాంగులు ,అంధులు కు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ లోని ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్నానని తనకు వస్తున్న జీవితంలోని కొంత డబ్బును వృద్ధులు వికలాంగులు ,అంధులు సహాయార్థం అందిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమం తో పాటు అనేక ప్రాంతాలలో ఆర్కెస్ట్రా, డాన్స్ బేబీ డాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించి వాటి ద్వారా వస్తున్నటువంటి విరాళాలను కూడా వృద్ధులు వికలాంగులు ,అంధులు తన వంతు గా అందిస్తున్నారని తెలిపారు ఎవరైనా అందులో వికలాంగులకు సహాయం చేయాలనుకుంటే నాగార్జునసాగర్ లోని శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ ఆర్కెస్ట్రాను సంప్రదించి అంధులు, వికలాంగులు వృద్ధులకు సహాయం చేయుటకు సహకరించాలని ఆయన కోరా రు. దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా అనేకమంది పేదలకు తన తల్లిదండ్రుల పేరున సహాయము చేస్తుంటే తనకు తన కుటుంబానికి ఎంతో సంతోషంగా ఉందని



అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకు, నటుడు గాయకులు డైరెక్టర్ జూనియర్ ఏఎన్ఆర్ దండు నాగేశ్వరరావు, భాగ్యమ్మ, దండు చంద్రమౌళి, లక్ష్మి, సైదులు, సాగర్, నాగి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించాలి



ఖమ్మం, ఏప్రిల్ 19 ( వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించి,కార్మికులపై పనిభారాలు పెంచి,ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ఆర్టీసీని కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలు చేస్తున్నారని వెంటనే ఆర్టీసీ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమ్మె డిమాండ్ల ను పరిష్కరించాలని,ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న గడ్డం లింగమూర్తి డిమాండ్ చేశారు.ఆదివారం ఉదయం ఖమ్మం మంచికంటి భవనంలో ఆర్టీసీ కార్మిక సంఘాలు,కేంద్ర,రాష్ట్ర కార్మిక,ప్రజాసంఘాల నాయకులతో గుండు మాధవరావు అధ్యక్షతన ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ప్రధాన వక్తగా పాల్గొన్న గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ సంక్లిష్ట పరిస్థితుల్లో ఆర్టీసీలో సమ్మె జరుగుతుందని ఆర్టీసీ కార్మికులంతా విశాల ఐక్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం లేబర్ కోడ్ ల అమలు విషయంలో స్పష్టతనీయడం లేదని,2017 వేతన ఎరియర్స్ చెల్లింపుల్లోనూ,2021 మరియు 2025 వేతన సవరణల విషయంలోనూ ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తూ ఉందని ఆక్షేపించారు.సమ్మె డిమాండ్లను పరిష్కరించి,ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఐటియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మా విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఆర్టీసీ రక్షణ,కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు అండగా సిఐటియు ఎల్లవేళలా ఉంటుందన్నారు.ప్రజల్లో భాగమైన ఆర్టీసీ కార్మికులకు అండగా ఉద్యోగులు,వ్యాపారులు,విద్యార్థులు,ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీలు సమ్మెకు మద్దతునీయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ గౌరవాధ్యక్షులు బీవీ రెడ్డి మాట్లాడుతూ అనేక రకాల విజ్ఞప్తులు,వినతి పత్రాలు ఇచ్చిన తర్వాతనే సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా నే సమ్మె లోకి నెట్టి వేయబడ్డామన్నారు.వామపక్ష కార్మిక సంఘమైన సిఐటియు సమ్మెలో ప్రత్యక్ష పోరాటం లోకి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో గుండు మాధవరావు సమావేశపు నోటు ప్రవేశపెడితూ ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె నోటీస్ ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కనీసం చర్చలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమ్మె డిమాండ్లు పరిష్కరించాలని,సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలు విడనాడాలని,విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీ కార్మికుల ఉద్యోగానికి వస్తున్న ప్రమాదాన్ని నివారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు.ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు,టియుసిఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య లు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావ సందేశం ప్రకటించారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు షేక్ బషీరుద్దీన్,ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్. నవీన్ రెడ్డి భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మెరుగు వెంకటరమణ,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు,స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం రీజియన్ కోశాధికారి పగిళ్ళపల్లి నరసింహారావు,ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య డిపో కమిటీ నాయకులు బుగ్గవీటి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత హిందూ సమాజమే శక్తి



### గాయత్రీ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శ్రీకాంతేంద్ర స్వామి పిలుపు

### హనుమకొండలో వైభవంగా హిందూ ధర్మ సమ్మేళనం

### హిందూ సమ్మేళన ఆహ్వాన సమతి ఆధ్వర్యంలో.. అంగరంగ వైభవంగా విశ్వశాంతి హోమం

హనుమకొండ, ఏప్రిల్ 19: దేశంలో హిందువులు ఎదుర్కొంటున్న సామాజిక, సాంస్కృతిక సమస్యలకు సంఘటిత హిందూ సమాజంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమని గాయత్రీ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ డాక్టర్ శ్రీకాంతేంద్ర స్వామి అన్నారు. ఆదివారం హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీ ఫేజ్-2, 60 ఫీట్ రోడ్ కాలనీవాసుల ఆధ్వర్యంలో స్థానిక పోచమ్మతల్లి ఆలయ ఆవరణలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం దొనకొండ లక్ష్మణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గాయత్రీ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ డాక్టర్ శ్రీకాంతేంద్ర స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రధాన వక్తగా కుటుంబ ప్రబోధన్ వరంగల్ విభాగ్ సంయోజక్ రాచకట్ల లక్ష్మణ సుధాకర్, మహిళా వక్తగా ప్రముఖ అడ్వకేట్, రాష్ట్ర సేవిక సమితి జిల్లా కార్యవాహిక సముద్రాల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి మాట్లాడుతూ.. దేశంలో హిందువులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం సంఘటిత హిందూ సమాజ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హిందూ ధర్మం, భారతదేశం విడదీయరాని తత్వాలని, ఒకటి ఆత్మ అయితే మరొకటి దేహమని అన్నారు. హిందూ ధర్మం గొప్పతనం "కలిసి బ్రతకడం -- బ్రతకనివ్వడం" అనే విలువలలో ప్రతిఫలిస్తుందని చెప్పారు. ఇతర మతాలను కూడా ఆదరించి, ఆశ్రయం ఇచ్చిన విశాల హృదయం హిందూ ధర్మానిదేనని పేర్కొన్నారు. అయితే కాలక్రమేణా ఆశ్రయం పొందిన వారే ఆక్రమణ ధోరణితో హిందువులపై దాడులు, మత మార్పిడులు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే హిందువులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధాన వక్త రాచకట్ల లక్ష్మణ సుధాకర్ మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి విశ్వగురువుగా నిలవాలంటే సమాజంలో సమగ్ర మార్పులు అవసరమని అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన పంచపరివర్తన్ పిలుపును ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ వస్తువుల వినియోగం, ధార్మిక విలువలతో కూడిన కుటుంబ నిర్మాణం, పౌర విధుల పట్ల కట్టుబాటు వంటి అంశాలను ఆచరిస్తేనే దేశం లక్ష్యాలను చేరుకుంటుందని తెలిపారు. మహిళా వక్త సముద్రాల కవిత మాట్లాడుతూ.. ప్రస్తుత తరం విదేశీ నాగరికత ప్రభావానికి లోనవుతోందని, యువతను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత కుటుంబ వ్యవస్థ, వైవాహిక సంప్రదాయాలు భారతదేశానికి ఉన్నప్పటికీ ప్రస్తుతం కుటుంబ విలువలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సంఘటిత హిందూ సమాజం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గాయత్రీ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ డాక్టర్ శ్రీకాంతేంద్ర స్వామిని,హిందూ సమ్మేళన ఆహ్వాన సమతి కమిటీ నాయకులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఉదయం కాలనీవాసుల మధ్య విశ్వశాంతి హోమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సమ్మేళనం అధ్యక్షులు దొనెకొండ లక్ష్మణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచర్ల కిరణ్, సమన్వయకర్తలు మధుసూదన్ రెడ్డి, మల్లారెడ్డి, టీఎన్జీవోస్ కాలనీ అధ్యక్షులు పోరెడ్డి సుధాకర్ రెడ్డి, హిందూ సమ్మేళన విశ్వశాంతి సమితి ప్రధాన కార్యదర్శి రాచర్ల కిరణ్, కోశాధికారి హజారే శ్రీధర్ సింగ్, ప్రచార వితరణ కమిటీ. ఏ కృష్ణారెడ్డి అధ్యక్షుడు కొత్తపెల్లి రమేష్ నెంబర్ సమన్వయ కమిటీ. ఏ మధుసూదన్ రెడ్డి కన్వీనర్ బి మల్లారెడ్డి. కో కన్వీనర్ సిహెచ్ భిక్షపతి నల్లాల రాజిరెడ్డి. వేదిక నిర్వహణ కమిటీ. ఫోర్ రెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షులు కాలనీ శ్రీ పోశాల రమేష్ బాబు ప్రధాన కార్యదర్శి బోగెల్లి మధుకర్ రావు. దేవి సింగ్. భోజన కమిటీ. బి సంజీవరెడ్డి, రామకృష్ణ దేవేందర్ రావు, విజయేందర్ రెడ్డి, కాలనీ ఫౌండర్ పింగిలి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీ మహిళా మణులు, కాలనీవాసులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**